నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 23 డిసెంబర్ 2023 | KAMAREDDY

ఘనంగా గణిత దినోత్సవం

గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ గణిత దినోత్సవాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. రాజంపేట మండలం తలమడ్ల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు రంగురాళ్లతో రూపొందించిన రామానుజన్ చిత్రం ఆకట్టుకున్నది.

నేడు వైకుంఠ ఏకాదశి

ముక్కోటి దేవతల అనుగ్రహం పొందే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలోని జెండా బాలాజీ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

భరోసా సెంటర్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 22 : నిజామాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పాటు కాబోతున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు అదనపు డీసీపీ జయరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉమెన్ సేఫ్టీ వింగ్ (షీ టీమ్స్ /భరోసా) హైదరాబాద్ అధికారులు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారని తెలిపారు. సెంటర్‌లో లీగల్ సపోర్టింగ్ పర్సన్ ఖాళీలు (1), సపోర్ట్ పర్సన్స్ ఖాళీలు (2), రిసెప్షనిస్టు ఖాళీలు(1), ఏఎన్ఎం ఖాళీలు (1) భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం ఐదు ఖాళీల కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తులను పోలీస్ కమిషనరేటు కార్యాలయంలో సమర్పించాలని అదనపు డీసీపీ వెల్లడించారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

స్నేహితురాలి పెండ్లికి వెళ్లే విషయమై భర్తతో గొడవ

శక్తినగర్ వంతెనపై నుంచి దూకి బలవన్మరణం

నిజాంసాగర్, డిసెంబర్ 22: తన స్నేహితురాలి పెండ్లికి వెళ్లే విషయమై భర్తతో గొడపడిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జుక్కల్ మండలంలో వెలుగు చూసింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుండూరు గ్రామానికి చెందిన శివాని(20) స్నేహితురాలి వివాహం హైదరాబాద్‌లో ఉంది. పెండ్లికి వెళ్తానని ఆమె భర్త పాండురంగ్‌ను కోరగా.. శక్తినగర్‌లో జరిగే ప్రధానానికి వెళ్లి రావాలని చెప్పాడు. శివాని ఏడాదిన్నర కుమార్తెను వెంట బెట్టుకొని ప్రధానంతో పాటు హైదరాబాద్‌లో పెండ్లికి వెళ్లి శక్తినగర్‌కు వచ్చింది. ఆమెను తీసుకురావడానికి గురువారం రాత్రి పాండురంగ్ వెళ్లాడు. పెండ్లికి వెళ్లొద్దని చెప్పినా.. ఎందుకు వెళ్లావని భార్యతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంటికి వస్తున్న తరుణంలో మార్గమధ్యంలో చలి ఎక్కువగా ఉంది.. పాపకు క్యాంప్ పెడుతాను.. బైకును ఆపామని భర్తను కోరింది. శక్తినగర్ వద్ద బైకును ఆపగా.. ఆమె వెంటనే వంతెన పైనుంచి నీటిలో దూకింది. శుక్రవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టగా.. సాయంత్రం ఆమె మృతదేహం లభించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గీతాభవనం @ 60 ఏండ్లు

ఆరు దశాబ్దాలుగా భగవద్గీత ప్రచారం

నేడే గీతాజయంతి

నిజామాబాద్ కల్చరల్ , డిసెంబర్ 22 : మార్గశిర శుద్ధ ఏకాదశి (నేడు) శనివారం గీతాజయంతి పర్వదినం. జిల్లా కేంద్రంలో శివాజీనగర్ గీతామందిరం, ఆర్మూర్‌రోడ్ మురళీకృష్ణ ఆలయంలతో పాటు రైల్వేస్టేషన్‌రోడ్ గీతాభవనంలో గీతాజయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గీతప్రవచనాలు, విష్ణు సహస్రనామ పారాయణాలు, గీతాయజ్ఞం తదితర ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

గీతా భవనానికి సుదీర్ఘ చరిత్ర

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ఉన్న అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలికి 60 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది. గీతాభవనం ఏర్పడి 60 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా త్వరలోనే వేడుకలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు గీతాభవనం కేంద్ర కార్యాలయం అధ్యక్ష కార్యదర్శులు ఎంఎస్. నర్సింహాచార్యులు, మేడిచర్ల ప్రభాకర్‌రావు తెలిపారు. రెండేండ్ల నుంచి మహిళలు, పోటీ పరీక్షలో పాల్గొనే విద్యార్థినుల కోసం ప్రత్యేక మహిళా గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు.

ధాన్యం సేకరణలో కామారెడ్డి టాప్

సెకండ్ ప్లేస్‌లో నిజామాబాద్

జిల్లా	సేకరించిన ధాన్యం (మె.టన్నులు)	రైతుల సంఖ్య	ధాన్యం విలువ (రూ.కోట్లలో)	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)
కామారెడ్డి	4.69 లక్షలు	78,810	1002.91	962.46
నిజామాబాద్	5.95 లక్షలు	64,697	922.00	910.00

రాష్ట్రంలో మళ్లీ సత్తా చాటిన ఉభయ జిల్లాలు

సమన్వయంతో విజయవంతం చేసిన యంత్రాంగం

వేగంగా కొనుగోళ్లు పూర్తి చేసిన వైనం

ఉమ్మడి జిల్లాలో రూ.1,924 కోట్ల ధాన్యం సేకరణ

1.43 లక్షల రైతులకు రూ.1872 కోట్ల చెల్లింపులు పూర్తి

నిజామాబాద్, డిసెంబర్ 22, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ధాన్యాన్ని సేకరించి కామారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచింది. ఇప్పటి వరకు రూ.వేయి కోట్లు విలువ చేసే ధాన్యాన్ని సేకరించి రాష్ట్రంలోనే నంబర్ వన్ జిల్లాగా కామారెడ్డి నిలిచింది. రెండో స్థానంలో నిజామాబాద్ జిల్లా నిలిచింది. ఇక్కడ రూ.922 కోట్లు విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 90శాతం చెల్లింపులు సైతం చకచకా పూర్తి చేయడం ద్వారా గతం మాదిరిగానే ఈసారి కూడా ఉభయ జిల్లాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన 32 జిల్లాలతో పోలిస్తే నంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఉభయ జిల్లాలు ముందంజలో నిలవడంతో ప్రభుత్వ యంత్రాంగం పనితీరుకు మరోసారి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. వాస్తవానికి ధాన్యం సేకరణ ప్రక్రియ చాలా క్లిష్టమైంది. రైతుల నుంచి పంట దిగుబడులను సేకరించే క్రమంలో ఎదురయ్యే సవాళ్లు అనేకం. ఇందులో పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థలతో పాటు వ్యవసాయ, సహకార, రవాణా, రెవెన్యూ, పోలీసు శాఖలు సైతం కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఉమ్మడిగా ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సమన్వయంతో పని చేస్తేనే ప్రక్రియ అన్నది విజయవంతం అవుతుంది. ఈ సీజన్‌లో అకాల వర్షాలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కొనసాగినప్పటికీ రైతులకు ఇక్కట్లు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా..

వానాకాలం 2023 సీజన్‌లో ధాన్యం సేకరణకు అసెంబ్లీ ఎన్నికలు కాసింత ప్రతిబంధకంగా నిలిచినప్పటికీ విజయవంతంగా ప్రక్రియ చేపట్టడం మెప్పు పొందుతున్నది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మొదటి వారమంతా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గత ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. చెల్లింపుల్లో ఇక్కట్లు లేకుండా ఉండేందుకు ముందస్తుగానే డబ్బుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నది. తద్వారా రైతుల ప్రయోజనాలను గత కేసీఆర్ సర్కారు కాపాడేందుకు కృషి చేసింది. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఎన్నికల హడావుడిలో కొట్టుమిట్టాడినా పూర్తి స్థాయి సమన్వయంతో రవాణా, రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ, సహకార శాఖలు, ఐకేపీలు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించాయి. వారం రోజుల్లోనే ధాన్యం అమ్ముకున్న రైతుల బ్యాంక్ అకౌంట్లలో నగదు జమ చేయడం ద్వారా రైతన్నలంతా సంతోషిస్తున్నారు.

సమన్వయంతోనే సాధ్యమైంది...

రైతుల వద్దకెళ్లి పంట దిగుబడిని సేకరించాం. ఎక్కడ అవసరమైతే అక్కడ కేంద్రాలను నెలకొల్పడం ద్వారా ఎవరికీ ఇబ్బంది కలగలేదు. మద్దతు ధర చెల్లింపుల్లో ఎలాంటి సమస్యల్లేకుండా సాంకేతికత సహకారంతో పూర్తి చేశాం. సిబ్బందికి ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలు పనికొచ్చాయి. నిజామాబాద్‌లో వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణ విజయవంతం కావడం ఆనందంగా ఉంది. క్షేత్ర స్థాయిలో ఆయా శాఖల సిబ్బందికి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అహర్నిశలు పని చేశారు. తద్వారానే ధాన్యం సేకరణలో ముందంజలో నిలిచాం.

– అభిషేక్ సింగ్, కామారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సేకరణలో కామారెడ్డి టాప్...

ఎప్పటిలాగే కామారెడ్డి జిల్లానే ధాన్యం సేకరణలో టాప్‌లో నిలిచింది. రాష్ట్రంలోనే అత్యధిక వేగంగా ప్రక్రియను పూర్తి చేసి ముందు వరుసలో నిలిచింది. కామారెడ్డి నంబర్ వన్‌గా, నిజామాబాద్ 2వ స్థానంలో నిలిచాయి. కామారెడ్డి జిల్లాలో 6లక్షల 50వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. 350 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించగా 349 ప్రారంభించగా ఇప్పటికే 328 మూసేశారు. 4లక్షల 69వేల 232 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. 78,810 మంది రైతుల నుంచి మొత్తం రూ.1002.91కోట్లు విలువ చేసే ధాన్యాన్ని సేకరించారు. ఇందులో రూ.962.46కోట్లు చెల్లింపులు పూర్తవ్వగా కేవలం రూ.40.45 కోట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 458 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించి 440 కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటికే కొనుగోళ్ల ప్రక్రియ ముగియడంతో 412 కేంద్రాలను మూసేశారు. మిగిలిన చోట్ల అక్కడక్కడా మిగిలి పోయిన ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రాలను అందుబాటులో ఉంచారు. పౌరసరఫరాల సంస్థ తాజా గణాంకాల మేరకు నిజామాబాద్ జిల్లాలో 5లక్షల 95వేల 345 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. 64,697 మంది రైతుల నుంచి రూ.922కోట్లు విలువ చేసే ధాన్యం సేకరణ పూర్తయ్యింది. ఇందులో రూ.910 కోట్లు చెల్లింపులు సైతం పూర్తి చేశారు. ఇంకా రూ.11.94కోట్లు మాత్రమే పెండింగ్‌లో ఉంది.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

త్వరలోనే శాశ్వత భవనంలోకి గురుకుల పాఠశాల

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, డిసెంబర్ 22 : బాలికలు విద్యా సంవత్సరం నష్టపోవద్దనే ఉద్దేశంతో నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో తాత్కాలిక భవనంలో తరగతులు, వసతి ఏర్పాటు చేశామని స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. దుర్కి గ్రామంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులంలో అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాన్సువాడ మండలం హన్మాజీపేట్–కోనాపూర్ సమీపంలో శాశ్వత భవన నిర్మాణానికి రూ.12 కోట్లతో శంకుస్థాపన జరిగిందన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యాక గురుకులాన్ని అక్కడికి తరలిస్తామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

ఉత్సాహంగా యువజనోత్సవ పోటీలు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 22 : నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లా స్థాయి యువజన ఉత్సవ పోటీలు –2024 శుక్రవారం నిర్వహించారు. పోటీలను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గెలుపొందిన క్రీడాకారులకు మేయర్ దండు నీతూకిరణ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, శిల్ప లింగం పాల్గొన్నారు.

ప్రచార ఖర్చుల వివరాలు అందజేయాలి

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

అభ్యర్థులతో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, డిసెంబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులందరూ ప్రచార ఖర్చుల వివరాలను డిసెంబర్ 29లోగా ఎన్నికల వ్యయ పరిశీలకుడికి అందజేయాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించి అభ్యర్థులు, ఏజెంట్లు సమర్పించాల్సిన వివరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖర్చుల వివరాలు సరిచూసుకొని, రిజిస్టర్ ద్వారా రోజువారీగా ఖర్చుల వివరాలు అందించాలన్నారు. గడువులోగా ఇవ్వకపోతే మూడేండ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులవుతారని తెలిపారు. పార్టీల నుంచి వచ్చిన డబ్బులు, ఖర్చు చేసిన వివరాలపై అఫిడవిట్ సమర్పించాలన్నారు. అధికారులు కిషన్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో భారీ చోరీ..

కిలోన్నర బంగారు ఆభరణాలు అపహరణ

గుడిలోకి వెళ్లి వచ్చేంతలోపే కారులోంచి బ్యాగు మాయం

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అదనపు డీసీపీ జయరాం

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 22 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం భారీ చోరీ జరిగింది. కారులోంచి రూ.90 లక్షల విలువైన కిలోన్నర బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మహాలక్ష్మీ కాలనీలో నివసించే డాక్టర్ ఈశ్వర్ చంద్ర మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం పాత పోలీస్ స్టేషన్ వద్ద క్లినిక్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కో–ఆపరేటివ్ బ్యాంకులోని లాకర్‌లో ఉన్న కిలోన్నర బంగారు ఆభరణాలను అవసరం నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం తీసుకున్నారు. బ్యాంకు నుంచి కారులో ఇంటికి బయల్దేరిన ఆయన మార్గమధ్యంలో ఉన్న మహాలక్ష్మీ మందిరం వద్ద కారు ఆపి దర్శనం చేసుకునేందుకు లోనికి వెళ్లాడు. దర్శనం అనంతరం బయటికి వచ్చిన ఆయనకు కారులో ఉంచిన బంగారు ఆభరణాల బ్యాగు కనిపించలేదు. బ్యాగు అపరహరణకు గురైందని గ్రహించిన ఈశ్వర్ చంద్ర ఆందోళనకు గురై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఒకేసారి బ్యాంకు లాకర్ నుంచి కిలోన్నర బంగారు ఆభరణలు తీసుకురావడం, ఆ తర్వాత పూజ చేయడానికి ఆలయానికి వెళ్లడం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీ జరిగిన విషయం తెలియగానే సీపీ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ జయరాం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆర్మూర్ ఏసీపీ, సీఐతో పాటు జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు వేలిముద్రల నిపుణులు కారును పరిశీలించి ఆధారాలను సేకరించారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష, కాంగ్రెస్ నాయకులు

ఎంపీల సస్పెన్షన్‌పై వెల్లువెత్తిన నిరసనలు

కేంద్రం దిష్టిబొమ్మల దహనం

కామారెడ్డి/ఖలీల్‌వాడి, డిసెంబర్ 22 : పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు, ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చకు తెచ్చిన ఎంపీలను సస్పెండ్ చేయడం అనైతికమన్నారు. డిసెంబర్ 13 భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వచ్చి మాట్లాడాలని అడిగినందుకు మొత్తం 146 మంది ఎంపీలపై వేటు వేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలు, రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు బీజేపీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఇండియా కూటమిగా డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతారని అన్నారు. డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌రావు, తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై చొరవ చూపాలి

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నిజామాబాద్ కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 22 : అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేయించుకునేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 6న డ్రాఫ్ట్ రోల్‌ను ప్రచురిస్తామని, అభ్యంతరాలుంటే జనవరి 22 వరకు బూత్ లెవల్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాటిని పరిష్కరించాక ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే వాటిని పరిశీలించి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి.. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా పదో తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థికీ అర్థమయ్యేలా నాణ్యమైన బోధన అందించాలన్నారు. 'పది' పరీక్షల సన్నద్ధత, ఉన్నతి లక్ష్య తదితర అంశాలపై ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఈవో దుర్గాప్రసాద్, జీసీడీవో వనిత, ఏసీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తా

కార్యకర్తలు, ప్రజల భిక్షతోనే నాకు పదవి

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి

మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 22 : జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, ప్రజల భిక్షతోనే తనను ఎమ్మెల్యే పదవి వరించిందని, తన విజయం కోసం కృషిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో బీజేపీ గెలుపు కోసం ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి బద్దం మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార తదితరులు పాల్గొన్నారు